8

# బుద్ధిశాలి

రామయ్య, సోమయ్య మంచి స్నేహితులు.

వాళ్ళకి ఎప్పటి నుంచో కాశీకి వెళ్లాలని కోరికగా ఉండేది. ఇద్దరి వయస్సుకూడా ఏభై ఏళ్ళు దాటింది. జీవితంలో ఒక్కసారైనా ఎలాగైనా కాశీకి వెళ్లి తీరాలని వాళ్ళ ఆలోచన! అయితే...ఆ రోజుల్లో ఇప్పటిలాగా రైళ్ళూ, బస్‌లు లేవు. ఎన్నో అడవులూ, కొండలూ, నదులూ దాటుకుంటూ ఆర్నెల్లు పైన ప్రయాణం చేస్తే కాని, కాశీ చేరడం సాధ్యపడేది కాదు.

వెళ్లే దారిలో అడవులలో ఎందరో యాత్రికులను పులులు, సింహాలువంటి క్రూరజంతువులు పొట్టన పెట్టుకుంటుండేవి. లేదా–దొంగలు దారికాసి ప్రయాణీకులను దోచుకుంటుండేవారు. ఆ రోజుల్లో 'కాశీకి వెళ్లినవాడూ, కాటికి వెళ్లేవాడూ ఒకటే..!' నసే సామెత వచ్చింది. అందువల్ల ఎవరైనా కాశీకివెళ్లాలనుకుంటే ఇంక తిరిగిరామని నిశ్చయించుకుని, అన్ని ఏర్పాట్లూ చేసుకుని మరీ వెళ్లేవారు.

అందరిలాగే సోమయ్య కూడా కాశీకి వెళ్లేందుకు అన్ని ప్రయత్నాలూ చేసుకున్నాడు. వెళ్లేముందు పిల్లలకి ఆస్తి పంపకాలన్నీ చేసేశాడు.

రామయ్య ఒంటరివాడు. కాశీ ప్రయాణంకోసం ఎంతో కష్టపడి డబ్బు కూడబెట్టుకున్నాడు. తనకి ఉన్న ఒక చిన్న పాత ఇంటిని కూడా అమ్మేశాడు. అయితే.., కాశీ నుంచి తిరిగి వచ్చాక బ్రతకాలి కదా! అందువల్ల ప్రయాణ ఖర్చులకి కావలసిన డబ్బు పోనూ మిగిలిన ఐదు వందలు ఎవరి దగ్గరైనా దాచుకోవాలనుకున్నాడు. ఎందుకంటే... ఆ డబ్బు వెంట తీసుకెళ్తే దారిలో దొంగలు కాజేస్తారు.

బాగా ఆలోచించి ఆ డబ్బుని ఊళ్ళో పెద్దవ్యాపారి అయిన లింగయ్య దగ్గర దాచి పెడదామను కున్నాడు. లింగయ్య అతనికి బాగా తెలిసినవాడు. పైగా... లక్షాధికారి. అందువల్ల డబ్బుకోసం కక్కుర్తి పడడని అనుకున్నాడు రామయ్య.

ఆరోజు రామయ్య, సోమయ్య కలిసి లింగయ్య దగ్గరకి వెళ్లారు.



తాము కాశీ వెళ్లబోతున్నట్లు చెప్పి, తాను కూడబెట్టిన ఐదు వందలను ఆయన వద్ద భద్రంగా దాచమని కోరాడు రామయ్య.

"నువ్వు కాశీ నుంచి వచ్చాక నీ డబ్బుని పువ్వుల్లో పెట్టి తిరిగి ఇస్తాను. హాయిగా వెళ్లిరా..!" అని భరోసా ఇచ్చాడు లింగయ్య.

లింగయ్య మీద నమ్మకం కొద్దీ ఆ డబ్బుని అతనికి ఇచ్చినట్లుగా రసీదు కూడా తీసుకోలేదు రామయ్య.

'కాశీకి వెళ్లిన రామయ్య వయసు మీరిన వాడు... ఇంకేమి తిరిగివస్తాడులే. !' అనుకొని ఆ డబ్బుని కాజేయాలనుకున్నాడు లింగయ్య.

ఏడాది దాటింది.

ఒకరోజు లింగయ్య దగ్గరకి రామయ్య ఒంటరిగా తిరిగి వచ్చాడు. సోమయ్య కాశీలో మరణించాడని చెప్పి కళ్ళ నీరు పెట్టుకున్నాడు. లింగయ్య రామయ్యని కొంతసేపు ఓదార్చాడు. మనసులో మాత్రం అతనికి నిజంగా ఎంతో సంతోషంగా ఉంది. ఎందుకంటే... రామయ్య తన దగ్గర డబ్బు దాచుకున్న విషయం సోమయ్య ఒక్కడికే తెలుసు. ఆ సోమయ్య ఇప్పుడు ఎలాగూ చచ్చిపోయాడు. అందువల్ల తానూ ధైర్యంగా అబద్ధం చెప్పవచ్చనుకున్నాడు.

కొంచెంసేపు ఆ మాటా ఈ మాటా మాట్లాడాక.., తాను దాచుకున్న డబ్బుని ఇమ్మని లింగయ్యని అడిగాడు రామయ్య.

"నీ డబ్బు ఏమిటి ! నా దగ్గర దాచటమేమిటి..? పూటకి గతిలేని వాడివి.., నీ దగ్గర ఐదు వందల రూపాయలున్నాయా ? ఒకవేళ నాకు ఇచ్చి వుంటే నేను వాటిని కాజేస్తానా? పో.. పో... ఇంకెవరైనా వింటే నవ్విపోతారు" అంటూ దబాయించి తరిమికొట్టాడు లింగయ్య.

చేసేది ఏమీలేక రామయ్య ఊరి పెద్ద నాగయ్య దగ్గరికి వెళ్లి తన గోడు చెప్పుకుని గోలపెట్టాడు. వారి తగాదాని 'మర్నాడు విచారిస్తాననీ, లింగయ్యని కూడా తీసుకురమ్మనీ' చెప్పి పంపాడు నాగయ్య.

మర్నాడు రామయ్య, లింగయ్య గ్రామ పెద్ద నాగయ్య ఇంటికి వచ్చారు.

ఆయన ఇంటి ముందు అంతా బురద బురదగా ఉంది. దాన్ని దాటి వాళ్ళు బురద కాళ్ళతో లోపలకి వెళ్లారు.

వాళ్ళని చూడగానే నాగయ్య "ఈరోజున పనివాడు రేపు పండగ కోసమని ఇంట్లో నీరంతా వాడేసి ఇల్లు కడిగాడు. ఈరోజునే ఈ పని చేయడంతో ఇంటి ముందంతా బురద అయింది. నీళ్ళు తెద్దామని చెరువుకి వెళ్లాడు. కాని, ఇంకా రాలేదు. ఇంట్లో వేరే నీరు లేదు. మీ ఇద్దరూ ఆ చెట్టు దగ్గరున్న రెండు చెంబుల నీరు చెరొకరు తీసుకుని కాళ్ళను కడుక్కొని లోపలకి రండి" అన్నాడు.

ఇద్దరూ కాళ్లు కడుక్కుని రావడానికి చెట్టు దగ్గరకి వెళ్లారు.

కాని, ఒక్కొక్క చెంబెడు నీళ్ళతో కాళ్ళకున్న బురద ఎలా వదులుతుంది? అదేమీ ఆలోచించు కోకుండా లింగయ్య దఢాలున చెంబెడు నీళ్ళు కాళ్ళమీద గ్రుమ్మరించుకున్నాడు. అతని కాళ్ళకున్న బురద కొద్దిగా మాత్రమే వదిలింది. రామయ్య మాత్రం-ముందుగా ఒక వెదురు బద్దను తీసుకొని కాళ్ళకున్న బురదను గీకేశాడు. ఆ తర్వాత చెంబులోని నీళ్ళను కొంచెం కొంచెం వాడుతూ జాగ్రత్తగా కడుక్కున్నాడు.

ఇదంతా గమనిస్తూనే ఉన్నాడు నాగయ్య.

రామయ్య, లింగయ్య... నాగయ్య దగ్గరకు వచ్చి తమ తమ వాదనలను వినిపించారు.

నాగయ్య అంతా విని, వారితో ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ "లింగయ్యా! రాత్రి నా కలలో సోమయ్య కనిపించాడయ్యా. రామయ్య నీకు డబ్బు ఇచ్చాడట. దానిని నువ్వు నేలలో పాతిపెట్టావట!" అన్నాడు.

ఆ మాటలు విని, "నేను నేలలో ఎక్కడ పాతిపెట్టానండీ! మా ఆవిడకి ఇచ్చాను" అని అనుకోకుండా జరిగింది చెప్పేసి, జరిగిన పొరపాటుకి నాలుక కొరుక్కున్నాడు లింగయ్య.

"నిజం నీ నోటవెంట ఎలా వచ్చిందో చూశావా? మీ ఇద్దరి స్వభావం కనిపెట్టాలనే ఉద్దేశంతో కావాలనే నేను మా ఇంటి ముందు బురద చేయించాను. రామయ్య కాళ్ళు కడుక్కున్న పద్ధతిని చూసి అతను కష్టపడి పనిచేసి, జాగ్రత్తగా డబ్బును కూడబెట్టే స్వభావం కలవాడని గ్రహించాను. నీవు కాళ్ళు కడుక్కున్న పద్ధతిని చూసి నీ సంపాదన న్యాయంగా ఆర్జించింది కాదని తెలుసుకున్నాను. అప్పుడే నాకు అర్థమయింది... రామయ్య చెప్పింది నిజమని! ఆ నిజాన్ని నీ నోటంట కక్కించడానికే సోమయ్య కలలోకి వచ్చాడని అబద్ధం ఆడాను. ఇప్పటికైనా నువ్వు రామయ్య డబ్బు వెంటనే తిరిగిఇచ్చేయి. అలా ఇవ్వని పక్షంలో నీకు శిక్ష తప్పదు" అని గట్టిగా బెదిరించాడు.

లింగయ్య లెంపలు వేసుకుని, క్షమాపణ కోరుకుని రామయ్య డబ్బు తిరిగి ఇచ్చేశాడు.

నాగయ్య తెలివితేటలను అందరూ మెచ్చుకున్నారు.

★★★

